నర్సింహారెడ్డి కళాశాలకు సీఎస్ఐ పురస్కారాలు


ఉత్తమ డైరెక్టర్ అవార్డు అందుకుంటున్న మోహన్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలో ఉన్న నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల పలు విభాగాలలో అవార్డులు దక్కించుకుంది. కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా(సీఎస్ఐ) ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో వార్షిక శ్రేష్ఠత పురస్కారాలు అందజేశారు. నర్సింహారెడ్డి కళాశాల డైరెక్టర్ మోహన్‌కు బెస్ట్ డైరెక్టర్ అవార్డు దక్కగా బెస్ట్ అవుట్‌స్టాండింగ్ వాలంటీర్ అవార్డు దినేష్ కుమార్‌కు, టెక్నికల్ యాక్టివిస్ట్ స్టూడెంట్ బ్రాంచ్ సీఎస్ఈ విభాగానికి, పలు అంశాలపై అ . ధ్యాపకులు కవిత, హేమలత, సుజిత్, సిరిచందన లతోపాటు పలువురు విద్యార్థులకు పురస్కారాలు దక్కాయి. యూనివర్సిటీ ఇంచార్జ్ వీసీ శైలజా రామయ్యర్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్నారు. అవార్డులు పొందిన డైరెక్టర్, అధ్యాపకులను సోమవారం కళాశాల చైర్మన్ నర్సింహ్మారెడ్డి, సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, డీన్ శ్రీలక్ష్మి అభినందించారు.

భూమిపూజ


తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ చేసిన చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: అన్నోజిగూడ ఎల్ఎన్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి చైర్మన్ కొండల్‌రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదనపు తరగతి గదులను రూ.13 లక్షలతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వేమనరెడ్డి, మౌలిక సదుపాయాల సంస్థ మేడ్చల్ సబ్ డివిజన్ ఏఈ ఎం.వెంకట్ జవహర్ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శ్రీనాగలింగేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు తరఫున ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేయడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు చెందిన సుమారు 900 మంది విద్యార్థులకు ఆయన నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డి ,ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో చంద్రారెడ్డి

వరకట్న వేధింపులకు తాళలేక...


శ్రావణి (ఫైల్)

జవహర్‌నగర్: వరకట్న వేధింపులు తాళలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడకు చెందిన వేముల శ్రావణి(23)కి నాగులపంచ హేమసుందర్‌తో 2023లో వివాహమైంది. వీరిద్దరు ఉద్యోగం చేసుకుంటూ దమ్మాయిగూడలోని ఎంఎల్ఆర్ కాలనీలో నివసిస్తున్నారు. వివాహ సమయంలో హేమసుందర్‌కు అత్తింటివారు కట్న కానుకలతోపాటు నగదు కూడా అందచేశారు. అయితే దుకాణం పెట్టుకుంటామని, అదనపు కట్నం కావాలని శ్రావణిని అతడు వేధించడం మొదలుపెట్టాడు. అదేవిధంగా సంతానం కలగకపోవడంతో ఆమెను అత్తమామలు మానసికంగా వేధించేవారు. దీంతో మనస్తాపం చెందిన శ్రావణి జూన్ 30న తన బెడ్‌రూమ్‌లో ఉరేసుకుంది. స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లినా శ్రావణి అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. శ్రావణి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంఆర్ ఆస్పత్రిలో డాక్టర్స్ డే వేడుకలు



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రిలో సోమవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఆస్పత్రి వైద్యులు, వైద్య విద్యార్థులతో కలిసి సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ వసంతలత కేక్ కట్ చేసి వైద్యులను అభినందించారు. అనంతరం ఆస్పత్రి ఆధ్వర్యంలో మేడ్చలోని సీఎంఆర్ పాఠశాలలో మెడికల్ క్యాంప్ నిర్వహించి విద్యార్థులకు పలు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీశైలంరెడ్డి, రాజిరెడ్డి, వెంకటరమణ, సూపరింటెంట్ మోహన్‌రెడ్డి, పీఆర్వో దుర్గాప్రసాద్ రెడ్డి, ఏఓ సురేశ్ పాల్గొన్నారు.

సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థికసాయం

ఘట్‌కేసర్: డయాబెటిక్ కారణంగా కాలికి పుండు ఏర్పడి కాలు తీసేయాల్సిన స్థితికి చేరుకున్న హైదరాబాద్ బీరంగూడక చెందిన జ్యోతికి సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సోమవారం రూ.10 వేల సాయం చేశారు. కాలికింది భాగం తొలగించడానికి రూ.లక్ష అవుతుందని వైద్యులు చెప్పడంతో నిరుపేద అయిన జ్యోతి ట్రస్ట్ సభ్యులను సంప్రదించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సుందర్‌రావు, వీరారెడ్డి, శ్రీకాంత్, ఐలయ్య, దేవేందర్, శరబంద, లింగస్వామి, బాబు, ఆనంద్, ప్రవీణ్‌కుమార్, రంగా పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

మేడ్చల్: వైద్యుల దినోత్సవం సందర్భంగా వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యులకు సన్మానం నిర్వహించారు. పట్టణంలోని సీహెచ్ఎస్‌సీలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో ఆనంద్, ఆసుపత్రి వైద్యులను వాసవీక్లబ్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ సభ్యులు రమేష్‌గుప్తా, కృష్ణమూర్తి గుప్తా, సంతోష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

'ధరణి పెండింగ్' 10 వేలకుపైనే..

ధరణి

రాష్ట్రస్థాయి ప్రజావాణిలో జిల్లా పెండింగ్ దరఖాస్తులు 938
- నేటి నుంచి కలెక్టరేట్‌లో ధరణిపై స్పెషల్ డ్రైవ్
- వారం రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశం
- ప్రజావాణికి హాజరుకాని జిల్లా అధికారులకు నోటీసులు


ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ గౌతమ్ తదితరులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న జిల్లా అధికార యంత్రాంగం మంగళవారం నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాలకు చెందిన తహసీల్దార్లు, వారి ధరణి టీమ్‌తో ప్రతీరోజు కలెక్టరేట్‌కు రావాలని ఆదేశించిన అధికార యంత్రాంగం పెండింగ్ దరఖాస్తులు పరిష్కారమయ్యే వరకు ఈ ప్రక్రియను కొనసాగించాలని సూచించింది. ఇద్దరు ఆర్డీఓలు కూడా ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కారం అయ్యే వరకు ప్రతీరోజు కలెక్టరేట్‌కు రావాలని ఆదేశించారు. ఇటీవల సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యధికంగా పెండింగ్ దరఖాస్తులు ఉన్న జిల్లా కలెక్టర్లను ఆయన హెచ్చరించినట్లు తెలిసింది. ఆ జాబితాలో మేడ్చల్ జిల్లా కూడా ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో మొత్తంగా ధరణికి సంబంధించిన దరఖాస్తులు 10 వేలకు పైగా ఉన్నాయి. ఇందులో నిషేధిత భూములకు సంబంధించిన దరఖాస్తులు అత్యధికంగా 3,161 ఉండగా, మ్యుటేషన్ 1,165, డాటా కరెక్షన్ 2,915, కోర్టు కేసులకు సంబంధించి 798, అర్బన్ ల్యాండ్‌కు సంబంధించిన దరఖాస్తులు 222 ఉన్నాయి.

రాష్ట్రస్థాయిలో పెండింగ్ దరఖాస్తులు 938

రాష్ట్ర స్థాయి ప్రజావాణిలో జిల్లాకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులు 938, జిల్లాలోని వివిధ స్థాయిల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు దాదాపు 4,987 ఉంటాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. వీటిన్నంటిని వారం రోజుల వ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల ప్రగతిని ఎప్పటికప్పుడు సంబంధిత దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు.

పెండెన్సీపై కలెక్టర్ సీరియస్

ప్రజావాణి దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మన జిల్లాకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం పరిధిలో పరిష్కరమయ్యే దరఖాస్తులు మినహాయించి, మిగతా పెండింగ్ దరఖాస్తులన్నింటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కలెక్టరేట్ ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం 114 దరఖాస్తులు వచినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, లా ఆఫీసర్ ప్రభావతి, భూసేకరణ అధికారి సైదులు వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హాజరుకాని వారికి నోటీసులు

ప్రజావాణి కార్యక్రమానికి హాజరుకాని జిల్లా అధికారులకు నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి ఆలస్యంగా వచ్చిన అధికారులకు కూడా నోటీసులు ఇవ్వాలని పేర్కొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

మేడ్చల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు. మండల పరిషత్ పాలకవర్గం పదవీకాలం ముగుస్తోందని, ఇదే చివరి సమావేశం అని పేర్కొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు పంపిణీ చేస్తున్న కవిత

ఘట్‌కేసర్: నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని ఘనాపూర్ కార్యదర్శి కవిత అన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఘనాపూర్ గ్రామంలో సోమవారం ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం అందాలంటే, పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటి పచ్చదనం పెంచాలన్నారు.

అభిషేక్ సేవలు మరవలేనివి

ఆత్మీయ సభలో కలెక్టర్ గౌతమ్


అభిషేక్ అగస్త్యను సన్మానిస్తున్న దృశ్యం

సాక్షి,మేడ్చల్ జిల్లా: జిల్లాలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా పని చేసిన అభిషేక్ అగస్త్య అందరినీ సమన్వయం చేసుకుంటూ, పనితీరులో సమర్థుడైన అధికారిగా మంచి పేరు తెచ్చుకున్నారని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ కొనియాడారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అభిషేక్ అగస్త్య ఖమ్మం మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆత్మీయసన్మాన సభ ఏర్పాటు చేశారు. అనంతరం కలెక్టర్ శాలువా, పూల బోకేతో ఆయనను ఘనంగా సన్మానించారు. ఇందులో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, లా ఆఫీసర్ చంద్రావతి శాలువా, బోకేలతో అభిషేక్‌ను సత్కరించారు. అనంతరం ఆయన జిల్లాకు చేసిన సేవలు మరవలేమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, జిల్లా, మండల స్థాయి అధికారులు అభిషేక్ అగస్త్యను శాలువాలతో సన్మానించి, మెమొంటులు అందజేశారు.

శాంతినికేతన్ స్కూల్ వద్ద ఆందోళన

దాడులపై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

శామీర్‌పేట్: శామీర్‌పేట మండలం బాబాగూడలోని శాంతినికేతన్ స్కూల్ యాజమాన్యం, సిబ్బంది విద్యార్థులపై దాడులు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. సోమవారం పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేశారు. వివరాలు... దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులను తల్లిదండ్రులు శామీర్‌పేటలోని శాంతినికేతన్ రెసిడెన్షియల్ విద్యాలయంలో ఈ అకాడమిక్ సంవత్సరం ప్రారంభం కాగానే చేర్పించారు. కాగా, శనివారం ఆ ఇద్దరు విద్యార్థులు స్కూల్ గోడ దూకి ఇంటికి చేరుకున్నారు. దీంతో ఎలా చేరుకున్నారని తల్లిదండ్రులు ప్రశ్నించగా స్కూల్ యాజమాన్యం కొడుతోందని, తట్టుకోలేకే గోడ దూకి వచ్చామని తెలిపారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం స్కూల్ ఎదుట ఆందోళన చేపట్టారు. అధిక ఫీజులు వసూళ్లు చేసి, విద్యార్థులకు సరిగ్గా భోజనం పెట్టకుండా తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మున్సిపల్ కమిషనర్‌గా శ్రీహరి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీహరి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా శ్రీహరి బాధ్యతలు చేపట్టారు. గత కమిషనర్ రాములు పదవీ విరమణతో ఆ స్థానం ఖాళీగా మారింది. దీంతో కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి గుండ్లపోచంపల్లి బాధ్యతలు అదనంగా అప్పగించారు. ఈ మేరకు సోమవారం నూతన కమిషనర్ శ్రీహరికి రాములు బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, డీఈఈ దుర్గాప్రసాద్, అధికారులు ప్రణతి, నర్సింహారెడ్డి, బిల్‌కలెక్టర్లు, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమనిర్మాణాలను అడ్డుకోవాలని వినతి



ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను వెంటనే అడ్డుకోవాలని కోరుతూ సోమవారం 9వ వార్డు కౌన్సిలర్ కొమురెల్లి అనితా సుధాకర్‌రెడ్డి సోమవారం ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు చేశారు. అనితా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ నాగారం ప్రధాన రహదారిలోని సర్వే నెంబర్ 308లో గల ఓపెన్ ప్లాటులో రెసిడెన్సియల్ నిర్మాణాలకు అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణాలు చేపడుతున్నారని, మున్సిపాలిటీ ఆదాయానికి గండిపడుతోందని అన్నారు. ఆ నిర్మాణాలను వెంటనే ఆపకుంటే టౌన్‌ప్లానింగ్ అధికారులపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

ప్రజావాణిలో బీజేపీ నేతల ఫిర్యాదులు


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

పోచారం: ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం పోచారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. యంనంపేట్‌లో రోడ్డుకు అడ్డుగా ఉన్న నిరుపయోగ వాటర్‌ట్యాంక్, 3, 11వ వార్డుల్లో తాగునీటి సమస్య, 4వ వార్డులో వర్షపునీరు ఇళ్లలోకి రావడంతో ప్రజల ఇక్కట్లు, రాజీవ్ గృహకల్పలో విద్యుత్ స్తంభాల మధ్య ఉన్న చెట్ల కొమ్మలు, అన్నానగర్‌లో పాడైపోయిన కరెంట్ జంక్షన్ బాక్సులు, 1వ వార్డుతోపాటు 18వ వార్డులోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో డ్రైనేజీ సమస్యలను ఫిర్యాదులో పేర్కొన్నారు. బీజేపీ నాయకులు సురేష్ నాయక్, అజయ్ యాదవ్, గుండె నరేష్, తార్యానాయక్, వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు 'సీఆర్‌పీఎఫ్'


విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న అనిల్‌మింజ్, ప్రిన్సిపాల్ అపర్ణ

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని సీఆర్‌పీఎఫ్ పాఠశాల 28వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీపీ అనిల్‌మింజ్ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే తమ లక్ష్యాలను అలవర్చుకోవాలన్నారు. సీఆర్‌పీఎఫ్ పాఠశాల విద్యార్థులు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తారన్నారు. సీఆర్‌పీఎఫ్ విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని తెలంగాణకు పేరు ప్రతిష్ఠలు తెచ్చిపెడుతున్నారని అన్నారు. అనంతరం బాస్కెట్‌బాల్, టెన్నిస్, కబడ్డీ కోర్టులను ప్రారంభించి, విద్యార్థులు తయారు చేసిన నమూనాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అపర్ణ, వెంకటరమణ, సెలస్టిన్, నవనీతరాణి, నూర్జహాన్, చంద్రశేఖర్, కూరపాటి రాజశేఖర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూలుస్తాం

ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని నాసిమ్‌చెరువు బఫర్ జోన్ పరిధిలో శ్మశానవాటిక నిర్మాణ పనులను అడ్డుకొని కూల్చివేయనున్నట్లు ఇరిగేషన్ డీఈ పి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్, కీసర తహసీల్దార్‌లకు లేఖ రాశారు. ఈ నిర్మాణాలపై పలువురు ఫిర్యాదు చేయడంతో ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ ప్రశాంత్, ఆర్.ఐ. కిషోర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. గతంలోనే పలువురు కాలనీవాసులు ఈ విషయమై జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యకు ఆదేశాలు జారీచేశారు.

సెయింట్ పీటర్స్ విద్యార్థులకు రోడా అవార్డులు


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కార్యదర్శి

మేడ్చల్‌రూరల్: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైసమ్మగూడలో ఉన్న సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాల రోటరాక్ట్ క్లబ్ విద్యార్థులు రోడా అవార్డులు అందుకున్నారు. ఇటీవల నిర్వహించిన రోటరాక్ట్ అవుట్ స్టాండింగ్ డిస్ట్రిక్ట్ అవార్డ్స్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు మిస్టర్ అండ్ మిసెస్ ఉమాంగ్‌లో ఉత్తమ ఫెలోషిప్ ఈవెంట్, డీఆర్‌డీ అవార్డులు సొంతం చేసుకున్నారు. వీటితోపాటు ఉత్తమ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇమేజ్, క్రికెట్ మహోత్సవ్ గుర్తింపు పొందారు. అవార్డులు సాధించిన విద్యార్థులను సోమవారం కళాశాల కార్యదర్శి టీవీరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, డైరెక్టర్ సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, పీఆర్వో రవిసుధాకర్ అభినందించారు.

చెరువులకేది రక్షణ..?

కబ్జాకు గురైన చెరువులతో లోతట్టు ప్రాంతాలు, కాలనీలకు వరద ముంపు
- యథేచ్ఛగా ఆక్రమణల పర్వం.. పట్టించుకోని అధికారులు
- హెచ్ఎండీఏ పరిధిలో 3,532 చెరువుల గుర్తింపు
- అక్రమణలో 450కిపైగా చెరువులు, కుంటలు ఉన్నట్లు అంచనా
- శాటిలైట్ సర్వేతో హద్దుల ఖరారు.. పరిరక్షణకు ఇరిగేషన్ శాఖ ముందడుగు


బోడుప్పల్ చింతలచెరువు


నాసించెరువు


సాక్షి, సిటీబ్యూరో: చెరువులకు రక్షణ కరువైంది. వాననీరు, వరదలతో నిండి కళకళలాడాల్సిన చెరువులు బహుళ అంతస్తుల భవనాలకు, కాలనీలకు నిలయంగా మారాయి. రాజకీయ పలుకుబడి, అంగ, అర్థబలం కలిగిన కబ్జాకోర్లు మేడ్చల్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల పరిధిలో సుమారు 450కిపైగా చెరువులను, చెరువు శిఖం భూములను, బఫర్ జోన్‌లను ఆక్రమించి పెద్ద ఎత్తున వెంచర్‌లు వేశారు. రూ.వందల కోట్లు ఆర్జించారు. స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు కట్టుకొన్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు మాత్రం దారుణంగా నష్టపోతున్నారు. వర్షాకాలంలో ఈ కాలనీలు, లోతట్టు ప్రాంతాలు, బస్తీలు, అపార్ట్‌మెంట్‌లు జలాశయాలుగా మారుతున్నాయి. హబ్సిగూడ, రామంతాపూర్ చెరువును ఆనుకొని ఏర్పడిన మూడు కాలనీలు ప్రతి వర్షాకాలంలో మునకేస్తున్నాయి. కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ప్రగతినగర్, నిజాంపేట్, గాజుల రామారం, సరూర్‌నగర్, మేడ్చల్, దమ్మాయిగూడ, బోడుప్పల్, పీర్జాదీగూడ, టోలిచౌకి, గుండ్లపోచంపల్లి, జల్‌పల్లి, బడంగ్‌పేట్, నాచారం, ఉప్పల్, చెంగిచర్ల, మల్కాజిగిరి, ఘట్కేసర్, పోచారం తదితర ప్రాంతాల్లో చెరువులు అదృశ్యమై కాలనీలు పుట్టుకొచ్చాయి. హెచ్ఎండీఏ విస్తరించి ఉన్న ఏడు జిల్లాల పరిధిలో 3,532 చెరువులు ఉన్నట్లు గుర్తించారు. గ్రేటర్ హైదరాబాద్‌సహా శివారులో దాదాపు వెయ్యికిపైగా చెరువులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేకపోవటంతో చెరువులు కబ్జాకు గురవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి.

☛ మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని విష్ణుపురి కాలనీ, శివపురి కాలనీ బాల సరస్వతి నగర్, దుర్గా నగర్, సర్దార్ పటేల్ నగర్ ప్రాంతాలు తరచూ వరద ముంపుకు గురవుతున్నాయి.

☛ ఈస్ట్ ఆనంద్బాగ్ డివిజన్ పరిధిలో అనంత సరస్వతి నగర్ ఎస్ఎండీసీ కాలనీ, శిరిడి నగర్, కళ్యాణ్ నగర్ ప్రాంతాలు చిన్నపాటి వర్షానికి కూడా ముంపుకు గురవుతుంటాయి.

చెరువుల పరిరక్షణకు...

గ్రేటర్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీలుసహా గ్రామ పంచాయతీల పరిధిలో 476 చెరువులు, కుంటలు, నాలాల సరిహద్దుల ఖరారు ప్రక్రియలో భాగంగా శాటిలైట్ సర్వే నిర్వహించారు. పట్టణాలు, గ్రామాలు, రహదారులకు పక్కన ఉన్న చెరువులు ఆక్రమణలకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉండటంతో ముందుగా అక్కడ చర్యలు చేపడతారు. పునరుద్ధరణలో భాగంగా ఎఫ్‌టీఎల్ పరిధి వరకు మార్కింగ్ ఇస్తారు. అక్రమ నిర్మాణాలుంటే కూల్చేస్తారు. హెచ్చరికలు బోర్డులు ఏర్పాటు చేయనున్నారు.


నాసించెరువు మ్యాప్


చెంగిచెర్ల చెరువు

ఇదేమి న్యాయం

కళ్ళ ముందు నాలా కబ్జా జరుగుతుంటే అధికారులు అడ్డుకోవాల్సింది పోయి. కబ్జాకోరులకు వత్తాసు పలుకుతున్నారు. బోడుప్పల్, పిర్జాదిగూడ పురపాలక సంఘాల పరిధిలోని పలు ప్రాంతాలు , కాలనీలు చెరువుల కబ్జాతో వరద ముంపుకు గురవుతున్నాయి. వర్ష కాలంలో భారీ వాన పడిదంటే లోతట్టు ప్రాంతాలు, బస్తీల ప్రజల బాధలు చెప్పనలవి కాకుండా ఉంటాయి. **బి.కిరణ్‌కుమార్, బోడుప్పల్**

వర్షాకాలం వస్తుందంటే భయం

దమ్మాయిగూడ పరిధిలో పలు కాలనీలు జలమయంగా మారుతున్నాయి. నాగారం మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్డు జలయమంగా మారటంతో గంటల తరబడి వాహనదారులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. నాలాల కబ్జాతో ప్రహరీలు కూలిపోతున్నాయి.వర్షకాలం వస్తుదంటే భయంగా ఉంటోంది. **రాంరెడ్డి, దమ్మాయిగూడ**